క్లుప్తంగా

బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలి

పుంగనూరు: కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న పుంగనూరులో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు జమీర్‌లాల్, అతిక్ తదితరులు పుంగనూరులో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని తమ సంఘం తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

విద్యార్థులకు సన్మానం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓలు

పులిచెర్ల(కల్లూరు): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. సోమవారం పులిచెర్ల హైస్కూల్లో జరిగిన అభినందన సభలో హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్‌వల్లి మాట్లాడుతూ పులిచెర్ల హైస్కూల్లో 73 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అందులో పి.రమ్య(560), ఆర్.రక్షిత(539), రెడ్డిశ్రావణి (536), జి.సుప్రజ(509) మార్కులు సాధించారన్నారు. ఈ విద్యార్థులను నగదు పురస్కారంతో పాటు శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

వి.కోట తహసీల్దార్‌గా ఉదయ్ సంతోష్



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

వి.కోట: మండల తహసీల్దార్‌గా ఉదయ్ సంతోష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న పార్వతి చిత్తూరుకు బదిలీపై వెళ్లడంతో ఉదయ్ సంతోష్ వి.కోట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సమస్యల 'సదన్'



పనిచేయని ఏసీ



పనిచేయని గీజర్

కాణిపాకం: కాణిపాకంలోని వినాయకసదన్‌లో వసతులు కరవుతున్నాయి. సదన్‌లో బస చేసే భక్తులు వసతులు లేమితో ఇబ్బంది పడుతున్నారు. వినాయక సదన్‌లో 100 గదులున్నాయి. ఇందులో నాన్ ఏసీ గదులు 52, సూట్‌లు 8, ఏసీ గదులు 40 ఉన్నాయి. ఈ గదులు చాలీచాలని పరిస్థితి. అయితే ఉన్న గదుల్లో కూడా వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పలు గదుల్లో ఏసీలు పనిచేయడం లేదు. వేసవి తాపం నుంచి కాస్త స్వేద తీరాలని భక్తులు ఏసీ ఆన్ చేస్తే అవి పని చేయకుండా మొరాయిస్తున్నాయి. దీంతో భక్తులు విలవిలలాడిపోతున్నారు. అలాగే గీజర్లు మూలనపడ్డాయి. వేకువజామున స్నానం చేయాలంటే అవస్థ పడుతున్నారు. అలాగే తాగునీటి కూలర్, ఫ్రిజ్జులు పక్కన పడేశారు. దీంతో వసతి గదుల నిర్వహణపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

వెదురు.. భలే ఖరీదు

ప్రస్తుతం ఏ పంట సాగు చేయాలన్నా భూమి దున్నకం, పంటసాగు, కలుపుతీయడం, చీడపీడల బెడద.. క్రిమి సంహారక మందుల పిచికారీ తప్పనిసరి. అయితే వెదురుసాగులో ఈ కష్టాలేవీ ఉండవు. నాటిన మొక్కలు బతికిన తరువాత ఎలాంటి మందులు కొట్టే పని ఉండదు.. చదునైన భూములే అవసరం లేదు. నీటి అవసరం కూడా పెద్దగా ఉండదు. వర్షాలతోనే వెదురు పెరుగుతుంది. టమాట సాగులో వెదురు కర్రల అవసరం పెరిగింది. అందుకే జిల్లాలో వెదురుసాగుకు ఆసక్తి చూపుతున్నారు.

- వెదురు కర్రలకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- టమాటా పంట సాగులో వెదురుకర్రల సపోర్టు
- ఓ కట్టె రూ.30.. ఎకరాకు 2,500 కట్టెలు అవసరం
- చీడపీడల బాధ ఉండదు.. మందులు కొట్టే పని లేదు
- నీటి వసతి లేని మెట్ట పల్లాల్లోనూ సాగు చేయవచ్చు
- ఓదఫా నాటితే 30 ఏళ్ల పాటు ఏటా గ్యారెంటీ ఆదాయం





రామాపురం వద్ద వెదురు తోట

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో రైతులు రకరకాల కూరగాయల పంటలను పండించి వాటికి ధరల్లేక కుదేలవుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా హైబ్రిడ్ రకాల టమాటా సాగవుతోంది. ఈ మొక్కలు పది అడుగుల దాకా పెరుగుతాయి. వీటికి సపోర్టుగా దృఢమైన వెదురు కర్రలు(స్టిక్స్) నాటాల్సి ఉంది. దీంతో ఈ ప్రాంతంలో వెదురుకర్రలకు విపరీతమైన డిమాండ్ వచ్చిపడింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, అరుణాచలప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఇక్కడికి వెదురు కర్రలు దిగుమతి అవుతున్నాయి. వీటిని కర్ణాటక, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురంలోని కొందరు వ్యాపారులు కొని రైతులకు విక్రయిస్తున్నారు. స్థానికంగా డిమాండ్ ఉన్న వెదురుతో మంచి లాభాలతో పాటు రైతులకు పెద్దగా పెట్టుబడి లేనందుకు స్థానిక రైతులు వెదురుసాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈదఫా చిత్తూరు జిల్లాలో 200 హెక్టార్లలో వెదురు సాగే లక్ష్యంగా ఉద్యానశాఖ చర్యలు చేపట్టింది.

ఎకరా టమాటాకు రూ.70 వేల ఖర్చు

ఎకరాపొలంలో టమాటా నాటాలంటే 2,500 మొక్కలకు ఒక్కోటి చొప్పున 2,500 వెదురు కర్రల అవసరం ఉంటుంది. ఒక్కో కర్ర ధర రూ.30 పలుకుతోంది. ఆ లెక్కన ఎకరానికి రూ.70 వేలు అవుతుంది. వేరే రకాల కర్రలు ఎక్కువ కాలం మన్నికరానుందున రైతులు వెదురు కర్రలనే టమాటాకు వినియోగిస్తున్నారు. పంట అయ్యాక వాటిని భద్రంగా ఉంచి మళ్లీ మరో పంటకు.. ఇలా కొన్నేళ్ల పాటు వాటిని వాడుకోవచ్చు.

ముప్పై ఏళ్ల వరకు రాబడే..

వెదురును ఓసారి నాటితే మళ్లీ ముప్పై ఏళ్ల దాకా జీవితకాలం ఉంటుంది. మొదటి మూడేళ్ల దాకా మొక్కలను జాగ్రత్తగా పెంచుకోవాలి. ఆపై ఏటా వెదురును కట్ చేస్తుంటే మళ్లీ మరిన్ని పిలకలు వచ్చి తోట మరింతగా అభివృద్ధి చెందుతుంది. హెక్టారు పొలంలో మూడేళ్ల నుంచి ఏటా తోట పెరిగే కొద్దీ లక్షదాకా ఆదాయం పొందవచ్చు.

పెరిగిన డిమాండ్

ఇప్పటికే వెదురుకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో మరింత డిమాండ్ వచ్చే అవకాశం ఉంటుంది. వెదురు ద్వారా పేపర్, నిర్మాణాలకు కర్రలుగా, కొయ్య బొమ్మలు, ఫ్లూయెల్ తయారీకి వినియోగిస్తారు. స్థానికంగా వెదురుకు మంచి మార్కెటింగ్ ఉంది. ప్రస్తుతం జిల్లాలో బీడుగా లేదా సాగుకు పెద్దగా యోగ్యం గాని భూములు దాదాపు 30 వేల హెక్టార్లుగా ఉన్నట్టు సమాచారం. ఇలాంటి భూముల్లోనే కాకుండా ఏ పొలాల్లో అయినా దీన్ని సాగు చేసుకోవచ్చు.

వెదురు సాగు మేలు



రైతులు అన్‌లెవల్ భూములు, గుట్టలుగా ఉన్న చోట నీటి వసతి లేని రైతులు రానున్న వర్షాకాలంలో వెదురును సాగుచేయడం మేలు. దీనికి పెద్దగా ఖర్చుండదు. 20 ఏళ్లకు పైగా పంట ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ జాతీయ వెదురు మిషన్ ద్వారా రైతులకు సబ్సిడీలు ఉన్నాయి.

–కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు డివిజన్

టమాటా కంటే వెదురు సాగే మేలు



ఈదఫా ఏడెకరాల్లో టమాటా సాగు చేశా. పంట పెట్టుబడిలో రూ.14 లక్షలైతే దీంట్లో కేవలం స్టిక్స్‌కే రూ.5 లక్షలైంది. ఇప్పుడు టమాటాకు ధర లేక తీవ్రంగా నష్టపోయా. దీనికి బదులు పెద్దగా పెట్టుబడి లేని వెదురును సాగు చేసుకోవడం మేలని ఇప్పుడు అనిపిస్తోంది. అందుకే నేను వెదురు సాగు చేయాలనుకుంటున్నా.

–గోవిందురెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం

జోరుగా ఇసుక తవ్వకాలు

పలమనేరు: మండలంలోని తావడపల్లి సమీపంలో ఉన్న కౌండిన్య నదిలో టి.వడ్డూరుకు చెందిన కొందరు అక్రమంగా ఇసుకను తోడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లకు నింపి గ్రామ సమీపంలోని శ్మశానం వద్ద డంప్ చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటిదాకా ఈ ప్రాంతంలో ఇసుక రవాణా పెద్దగా లేదు. కానీ వారంరోజులుగా ఇసుక తవ్వకాలు ఎక్కువగా సాగుతున్నాయి. దీంతో నదిలో చెక్‌డ్యామ్‌ల వద్ద ఉన్న నీరు మొత్తం ఇంకిపోతుందని తావడపల్లి, టి.వడ్డూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ఉరుసు ముగింపు

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన హజరత్ నూర్‌షావలి బాబా ఉరుసు సోమవారం వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఉరుసు కార్యక్రమాన్ని దర్గా కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి ఉరుసు ముగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉరుసు కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు పాల్గొనడం సంతోషకరమన్నారు. అలాగే మున్సిపాలిటీ, పోలీస్, ఇతర అధికారులు ఉరుసు విజయవంతం అయ్యేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెరిట్ విద్యార్థులకు పురస్కారాలు

పలమనేరు: ఇటీవల వెలువడిన ఇంటర్, టెన్త్ పరీక్షాఫలితాల్లో ప్రతిభ చూపిన గాండ్ల కుల విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారంతో పాటు సన్మాన కార్యక్రమం మే 4న నిర్వహించనున్నట్లు అఖిలభారత గాండ్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమసంఘ నాయకులు ఏఆర్ కుమార్, బాలసుబ్రమణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని పూజిత రెసిడెన్సీలో కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని గాండ్లకుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సంగమం



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థినులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2005–06లో చదువుకున్న పూర్వ విద్యార్థినులు స్థానిక స్కూల్‌లో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులకు పాదాభివందాలను చేసి ఘనంగా సన్మానించారు. గత కొన్నాళ్లుగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరూ ఒకే చోటకు చేరేలా తెలుసుకుని గెట్ టు గెదర్‌ను ఏర్పాటు చేసినట్టు పూర్వ విద్యార్థులు గీత, నిరంజని, హిమబిందు తెలిపారు. తాము ఈరోజు మంచి స్థితిలో ఉన్నామంటే.. దానికి కారణమైన స్కూల్ అభివృద్ధికి సైతం సహకారం అందిస్తామన్నారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తాము చదువు చెప్పిన పిల్లలు నేడు ఉన్నత స్థాయిలో ఉండి, తమను గౌరవించడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని నాటి గురువులు మురిసిపోయారు.

తోడు - నీడ



ఎడారిలో ఆముదపు మొక్క అయినా మహా వృక్షమే అంటారు. మండు వేసవిలో నడినెత్తిన సూరీడు సుర్రుమనిపిస్తుంటే కాస్తంత నీడదొరికితే చాలనుకుంటారు ప్రయాణికులు. చిత్తూరు–వేలూరు రహదారిపై అనుపు గ్రామం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చనిచెట్లు వాహన చోదకులకు చల్లని నీడతోపాటు మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి చేకూర్చిన అందమైన ఆర్చిలా పచ్చనిచెట్లు రోడ్డుపై ఎండ నుంచి గొడుగు పడుతుంటే ఈ రహదారిలో ప్రయాణించేవారు కొంతసేపు చెట్లనీడన ఆగి వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. పంటపొలాల మీదుగా వచ్చే చల్ల గాలులను చెట్లు నీడన కూర్చుని ఆస్వాదిస్తున్నారు. – గుడిపాల

చీకట్లో కృష్ణమూర్తి కాలనీ

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని కృష్ణమూర్తి కాలనీలో వీధి లైట్లు వేయాలని గ్రామస్తులు తెలిపారు. కృష్ణమూర్తి కాలనీ పట్టణానికి చివరిగా ఉందన్నారు. ఇక్కడ పాముల బెడద ఎక్కువగా ఉందన్నారు. రాత్రి పూట తాగుబోతులు ఎక్కువగా తిరుగుతున్నారని తెలిపారు. ఎప్పుడు ఏమీ జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నామని వాపోయారు. వీధి లైట్లు వేయాలని పంచాయతీ అధికారులకు, మండల స్థాయి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకుని వీధిలైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

చిత్తూరు నగరంలోని 8వ డివిజన్ పరిధిలో ఉన్న కుమార్ నగర్ కాలనీ– సీఎంటీ రోడ్డుపై ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్‌ను ప్రతి ఆర్నెల్లకు ఓసారి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు, శాశ్వత పరిష్కారం కనుగొనలేకపోతున్నారు. మురుగునీళ్లు వెంగళరావు కాలనీను ముంచెత్తేటప్పుడు ఈ మ్యాన్‌హోల్‌కి దిగి.. నాలుగు బండ రాళ్లు తీయడం, ఆపై గేటుతో మూసేయడం మామూలే. కాలువ నీళ్లు సక్రమంగా ప్రవహించడానికి ప్రత్యామ్నాయ చర్యలు ఏర్పాటు చేస్తే.. ఇక్కడ మ్యాన్‌హోల్ అవసరం ఉండదని అధికారులు గుర్తించడంలేదు. ప్రస్తుతం ఈ మ్యాన్‌హోల్‌లో ఓ ఇనుప గేటును పెట్టిన సిబ్బంది.. పెద్ద ప్రమాదం జరగకముందే మేలుకోవాల్సిన అవసరం ఉంది.

– చిత్తూరు అర్బన్



మ్యాన్‌హోల్‌కు అడ్డుగా పెట్టిన ఇనుప గేటు

ఉగ్రవాదం నశించాలి



ఉగ్రవాదుల బొమ్మలతో శవయాత్ర చేస్తున్న రెడ్డిసంఘం సభ్యులు

పలమనేరు: ఉగ్రవాదం నశించాలని కోరుతూ పలమనేరు పట్టణంలో స్థానిక యోగి వేమారెడ్డి సంక్షేమ సంఘ నిర్వాహకులు ఆదివారం రాత్రి ఉగ్రవాదుల బొమ్మలతో శవయాత్ర చేపట్టి వాటిని దహణం చేశారు. ఈ సందర్భంగా కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని క్యాండిల్ ర్యాలీ చేసి ప్రార్థించారు. రెడ్డి సంఘం నాయకులు చెంగారెడ్డి, హేమంత్‌కుమార్ రెడ్డి, సోమచంద్రారెడ్డి, మైనారిటీ నేత ముజ్జు తదితరులు మాట్లాడుతూ దేశంలో ఎన్నో ఏళ్లుగా అన్ని మతాల వారు కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉన్నారన్నారు. కానీ కశ్మీర్‌లో టెర్రరిస్టుల కారణంగా దేశంలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొనే పరిస్థితి ఉందన్నారు. పాక్ ప్రేరేపిత చర్యల కారణంగా ఇండియాలోని ముస్లింలకు గౌరవం లేకుండా పోతోందని ముజ్జు తెలిపారు. ఇందులో పలువురు రెడ్డిసంఘ నాయకులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత ఆచరణతో శివయాత్ర



సరోజమ్మ మృతదేహానికి శివయాత్ర చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

పలమనేరు: పట్టణానికి చెందిన త్రైతసిద్ధాంత ప్రబోధా సేవాసమితి సభ్యురాలు సరోజమ్మ సోమవారం మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు ప్రబోధా సేవాకమిటీ సభ్యులు ఆమె శవాన్ని ఊరేగింపుగా శివయాత్ర చేపట్టి హైందవ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. ప్రతి మనిషిలో ఆత్మ, జీవాత్మ, పరమాత్మ ఉంటాయని మృతి చెందినప్పుడు జీవుడు, ఆత్మ వెళ్లిపోగా పరమాత్మ మిగిలి ఉంటాడని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో పలమనేరు, బంగారుపాళెం, వీకోట, కుప్పం, కోలార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించండి



పుంగనూరు: దళిత సంఘ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప

పుంగనూరు: రాష్ట్రంలో దళితుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దళిత సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎం.శంకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో కార్యవర్గ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరప్ప మాట్లాడుతూ ప్రతి మండలంలో రెవెన్యూ సమస్యలు తీవ్రంగా ఉందన్నారు. సాగు చేసి వారి పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని, పట్టా పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వర్క్ షాప్

సదుం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కిశోరవికాసంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు మల్లీశ్వరి ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది హాజరవుతారని చెప్పారు. బాలికల చదువు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామన్నారు.

'ఆదర్శ'ం.. 'దశ'దిశలా..

ఆదర్శ పాఠశాల విద్యార్థులు గత నాలుగేళ్లుగా ఉత్తమ ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తరగతి గదులు లేకపోయినా.. హాస్టల్ భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నా విద్యార్థులు మాత్రం తమ లక్ష్యాన్ని మరువలేదు. విద్యార్థినులను రాటుదేల్చడంలో ప్రిన్సిపల్ సరళ కృషి అమోఘం. ఆమె ఎక్కడ పని చేసినా వందశాతం ఉత్తీర్ణత ఖాయం.

- జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల
- గత నాలుగేళ్లుగా వరుసగా మండల టాపర్లు ఈ స్కూల్ విద్యార్థులే
- ఈ ఏడాది పది ఫలితాల్లో 586 మార్కులు సాధించిన రిషిత
- ప్రిన్సిపల్ సరళ ఉంటే 100 శాతం ఫలితాలు ఖాయం





ఆదర్శ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో..

రొంపిచెర్ల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఏటా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సరళ అవిశ్రాంత కృషే ఇందుకు ప్రధాన కారణం. ఈమె ఎక్కడ పని చేసినా 100 ఫలితాలు సాధించడం ఖాయం. ఉమ్మడి చిత్తూరు జిల్లా కంభంవారిపల్లె ఆదర్శ పాఠశాల నుంచి రొంపిచెర్లకు 2018 సంవత్సరంలో బదిలీపై వచ్చారు. ఇక్కడ అదే సంవత్సరం ఆదర్శ పాఠశాలను ప్రారంభించారు. ఈ స్కూల్‌కు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. అయితే బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో చాలీచాలని తరగతి గదుల్లోనే విద్యాబోధన ప్రారంభించారు. ఆదర్శ పాఠశాలకు సొంత భవనం కావాలని గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన రొంపిచెర్ల క్రాస్ రోడ్డుకు సమీపంలో స్థలాన్ని కేటాయించి ప్రభుత్వం నుంచి రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అధికారులు హాస్టల్ భవనాలను శరవేగంగా నిర్మించి ప్రారంభించారు. ఇప్పుడు అక్కడే తరగతులను నిర్వహిస్తున్నారు. అయితే తరగతి గదులకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఆ పనులు కూడా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు కనీసం సౌకర్యాలు లేకపోయిన ఫలితాల సాధనలో మాత్రం వెనుదిరిగి చూడలేదు. అరకొర సౌకర్యాలతోనే చిత్తూరు జిల్లాలో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల ఆదర్శంగా నిలుస్తుంది.

ఉత్తమ ఫలితాలు ఆమె సొంతం



ప్రిన్సిపల్ సరళ

ఆదర్శ పాఠశాలలో 2020–21 సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఆ సంవత్సరం 31 మంది విద్యార్థులు, 2021–22 సంవత్సరంలో 36 మంది విద్యార్థులు, 2022–23 సంవత్సరంలో 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే 2024 సంవత్సరంలో 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది 49 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా ఆదర్శ పాఠశాల విద్యార్థిని రిషిత 586 మార్కులు సాధించింది. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడం కొసమెరుపు. దీని వెనుక ప్రిన్సిపల్ సరళ కృషి, పట్టుదల ఎంతో ఉంది. పాఠశాలలో సాధించిన ఫలితాలను చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలోనే చదివించాలని భావిస్తున్నారు.

పదిలో బోల్తా పడిన బాలురు..

పదో తరగతి ఫలితాల్లో రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల బాగా వెనకబడింది. 54 మంది విద్యార్థులు రాయగా కేవలం 19 మంది మాత్రమే పాస్ అయ్యారు. 35 మంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో ఫలితాల్లో చివరి స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో ఆదర్శ పాఠశాల, రెండో స్థానంలో కేజీబీవీ నిలిచాయి.